11-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - సదా ఇదే నషాలో ఉండండి - భగవంతుడు మమ్మల్ని చదివిస్తున్నారు, మా ఈ విద్యార్థి జీవితము అత్యుత్తమమైనది, మాపై బృహస్పతి దశ ఉంది"

ప్రశ్న:- ఏ పిల్లలకు అందరి ప్రేమ ప్రాప్తిస్తుంది?

జవాబు:- ఎవరైతే అనేకుల కళ్యాణానికి నిమిత్తులుగా అవుతారో వారికి. ఎవరి కళ్యాణమైతే జరుగుతుందో వారు - మీరు మా తల్లి అని అంటారు. కావున మిమ్మల్ని మీరు చూసుకోండి - నేను ఎంతమంది కళ్యాణాన్ని చేస్తున్నాను? తండ్రి సందేశాన్ని ఎంతమంది ఆత్మలకు ఇస్తున్నాను? తండ్రి కూడా సందేశకుడే. పిల్లలైన మీరు కూడా తండ్రి సందేశాన్ని ఇవ్వాలి. అందరికీ చెప్పండి - ఇద్దరు తండ్రులు ఉన్నారు, అనంతమైన తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి.

పాట:- నీవు ప్రేమసాగరుడవు... (తూ ప్యార్ కా సాగర్ హై...)

ఓంశాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు ప్రతి రోజు అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఆత్మాభిమానులుగా అయి కూర్చోండి. బుద్ధి బయట భ్రమిస్తూ ఉండకూడదు. ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. వారే జ్ఞానసాగరుడు, ప్రేమసాగరుడు. జ్ఞానపు ఒక్క బిందువైనా చాలు అని అంటారు. తండ్రి అంటారు - మధురాతి మధురమైన పిల్లలూ, ఆత్మిక తండ్రిని స్మృతి చేసినట్లయితే మీకు ఈ వారసత్వము లభిస్తుంది, అమరపురి అయిన వైకుంఠములోకి వెళ్ళిపోతారు. ఈ సమయంలో శిరస్సుపై పాపాల భారమేదైతే ఉందో దానిని దించుకోవాలి. నియమానుసారముగా, వివేకమనుసారముగా పిల్లలైన మీకు అర్థం చేయించడం జరుగుతుంది. ఎవరైతే ఉన్నతోన్నతులుగా ఉండేవారో వారే మళ్ళీ అంతిమంలో కింద తపస్య చేసుకుంటున్నారు. రాజయోగ తపస్యను ఒక్క తండ్రే నేర్పిస్తారు. హఠయోగము పూర్తిగా వేరు. అది హద్దులోనిది, ఇది అనంతమైనది. అది నివృత్తి మార్గము, ఇది ప్రవృత్తి మార్గము. తండ్రి అంటారు, మీరు విశ్వానికి యజమానులుగా ఉండేవారు. యథా రాజా, రాణి తథా ప్రజా... ప్రవృత్తి మార్గములో పవిత్రమైన దేవీ-దేవతలుగా ఉండేవారు, తర్వాత దేవతలు వామ మార్గములోకి వెళ్ళారు. వాటి చిత్రాలు కూడా ఉన్నాయి. చాలా అశుద్ధమైన చిత్రాలను తయారుచేస్తారు, వాటిని చూడడానికి కూడా సిగ్గుగా అనిపిస్తుంది ఎందుకంటే బుద్ధి పూర్తిగా సమాప్తమైపోతుంది. నీవు ప్రేమసాగరుడవు అన్నది తండ్రి గాయనమే. వాస్తవానికి ప్రేమ బిందువు అనేది ఉండదు, ఇది జ్ఞానానికి సంబంధించిన విషయము. మీరు తండ్రిని గుర్తించి తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు వస్తారు. తండ్రి సద్గతికి సంబంధించిన జ్ఞానాన్నే ఇస్తారు. కొద్దిగా వింటారు, సద్గతిలోకి వచ్చేస్తారు. ఇక్కడి నుండి పిల్లలైన మీరు కొత్త ప్రపంచములోకి వెళ్ళాలి. మనం వైకుంఠానికి యజమానులుగా అవుతామని మీకు తెలుసు. ఈ సమయంలో మొత్తం విశ్వమంతటి పైనా రావణరాజ్యం ఉంది. విశ్వ రాజ్యాన్ని ఇవ్వడానికి తండ్రి వచ్చారు. మీరందరూ విశ్వానికి యజమానులుగా ఉండేవారు. ఇప్పటివరకూ ఆ చిత్రాలు ఉన్నాయి. ఇకపోతే లక్షల సంవత్సరాల విషయమేమీ కాదు. అది తప్పు. తండ్రినే ఎల్లప్పుడూ ధర్మయుక్తమైనవారు అని అంటారు. తండ్రి ద్వారా మొత్తం విశ్వమంతా ధర్మయుక్తముగా అవుతుంది. ఇప్పుడు అధర్మయుక్తముగా ఉంది. ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నారు. కానీ కొందరు జ్ఞానాన్ని వింటూ-వింటూ ఆశ్చర్యము కలిగించేలా వింటారు, వినిపిస్తారు, మళ్ళీ పారిపోతారు, ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. అహో మమ మాయ, నీవు ఎంత శక్తివంతముగా ఉన్నావు, తండ్రి నుండి విముఖులుగా చేస్తావు. అది శక్తివంతముగా ఎందుకు ఉండదు, అర్ధకల్పం దాని రాజ్యం కొనసాగుతుంది. రావణుడు అంటే ఏమిటి, ఇది కూడా మీకు తెలుసు. ఇక్కడ కూడా కొందరు పిల్లలు వివేకవంతులుగా ఉన్నారు, కొందరు వివేకహీనులుగా ఉన్నారు.

ఇప్పుడు మనపై బృహస్పతి దశ ఉందని, కావుననే మనం స్వర్గములోకి వెళ్ళేందుకు పురుషార్థము చేస్తున్నామని మీకు తెలుసు. మనుష్యులు ఎవరైతే మరణిస్తారో వారేమీ స్వర్గములోకి వెళ్ళేందుకు పురుషార్థము చేయరు. వారు స్వర్గస్థులయ్యారు అని కేవలం నామమాత్రంగా అనేస్తారు. మీకు తెలుసు - సత్యాతి-సత్యముగా స్వర్గములోకి వెళ్ళేందుకు పురుషార్థము మనం చేస్తున్నాము అనగా స్వర్గానికి యజమానులుగా అయ్యేందుకు పురుషార్థము చేస్తున్నాము. వీరు స్వర్గానికి వెళ్తున్నారు అని ఈ విధంగా ఎప్పుడూ ఎవ్వరూ అనరు. అలా అంటే - అలా ఎందుకు అంటున్నావు, నోరు మూసుకో అని అంటారు. మనుష్యులైతే హద్దులోని విషయాలనే వినిపిస్తారు. తండ్రి మీకు

అనంతమైన విషయాలను వినిపిస్తారు. పిల్లలైన మీరు చాలా పురుషార్థము చేయాలి. ఎంతో నషా ఎక్కాలి. ఎవరైతే కల్పపూర్వము పురుషార్థము చేసారో, ఏ పదవినైతే పొందారో అదే పొందుతారు. అనేక సార్లు పిల్లలైన మీ చేత మాయపై విజయం పొందేలా చేసారు. మళ్ళీ మీరు ఓడిపోయారు కూడా. ఇది కూడా డ్రామాగా తయారై ఉంది. పిల్లలకు ఎంతో సంతోషము ఉండాలి. మృత్యులోకము నుండి అమరలోకములోకి వెళ్తున్నారు. విద్యార్థి జీవితము అత్యుత్తమమైనది. ఈ సమయములో మీది అత్యుత్తమమైన జీవితము, దీని గురించి మనుష్యులెవ్వరికీ తెలియదు. భగవంతుడే స్వయంగా వచ్చి చదివిస్తారు, ఇది అత్యుత్తమమైన విద్యార్థి జీవితము. ఆత్మయే చదివిస్తుంది, అప్పుడు వీరి పేరు ఫలానా అని అంటారు. ఆత్మయే టీచర్ కదా. ఆత్మయే విని ధారణ చేస్తుంది, ఆత్మయే వింటుంది కానీ దేహాభిమానం కారణముగా అర్థం చేసుకోరు. సత్యయుగములో కూడా - ఆత్మనైన నాకు ఈ శరీరము లభించింది, ఇప్పుడు వృద్ధావస్థ వచ్చింది అని భావిస్తారు. ఇప్పుడు నేను ఈ పాత వస్త్రాన్ని వదిలి కొత్తదానిని తీసుకుంటాను అని వెంటనే సాక్షాత్కారం కలుగుతుంది. భ్రమరము ఉదాహరణ కూడా ఈ సమయానికి చెందిందే. మనం బ్రాహ్మణీలమని ఇప్పుడు మీకు తెలుసు. డ్రామా ప్లాన్ అనుసారంగా ఎవరైతే మీ వద్దకు వస్తారో, వారికి భూ-భూ చేస్తారు, అప్పుడు వారిలో కూడా కొందరు అపరిపక్వముగా అవుతారు, కొందరు కుళ్ళిపోతారు. సన్యాసులు ఈ ఉదాహరణను ఇవ్వలేరు. వారు ఏమైనా తమ సమానముగా తయారుచేస్తారా. మీ వద్దనైతే లక్ష్యము-ఉద్దేశ్యము ఉన్నాయి. ఈ సత్యనారాయణ కథ, అమరకథ... ఇవన్నీ మీవే. ఒక్క తండ్రే సత్యాన్ని వినిపిస్తారు. మిగిలినదంతా అసత్యమే. అక్కడ సత్యనారాయణ కథను వినిపించి ప్రసాదము తినిపిస్తూ ఉంటారు. ఆ హద్దులోని విషయాలు ఎక్కడ, ఈ అనంతమైన విషయాలు ఎక్కడ. మీకు తండ్రి డైరెక్షన్లు ఇస్తారు. మీరు నోట్ చేసుకుంటారు, ఇకపోతే పుస్తకాలు, శాస్త్రాలు మొదలైనవన్నీ అంతమైపోతాయి. పాత వస్తువులేవీ ఉండవు. కలియుగానికి ఇంకా 40 వేల సంవత్సరాలు ఉన్నాయి అని మనుష్యులు భావిస్తారు, అందుకే పెద్ద-పెద్ద భవనాలు మొదలైనవాటిని తయారుచేస్తూ ఉంటారు, ఖర్చు చేస్తూ ఉంటారు, కానీ సముద్రము వదులుతుందా? ఒక్క అలతో మింగేస్తుంది. ఒకప్పుడు ఈ బాంబే లేదు, అలాగే ఇది ఉండదు కూడా. ఇప్పుడు ఈ 100 సంవత్సరాలలో ఇవన్నీ ఏవేవో వెలువడ్డాయి. ఇంతకుముందు వైస్రాయ్ కూడా నాలుగు గుర్రాల బండిలో వచ్చేవారు. ఇప్పుడు ఈ కొద్ది సమయంలో ఏమేమి తయారయ్యాయో చూడండి. స్వర్గమైతే చాలా చిన్నది. నదీ తీరముపై మీ మహళ్ళు ఉంటాయి.

ఇప్పుడు పిల్లలైన మీపై బృహస్పతి దశ ఉంది. మేము ఇంత షావుకార్లుగా అవుతున్నాము అని పిల్లలకు సంతోషము ఉండాలి. ఎవరైనా దివాలా తీస్తే దానిని రాహు దశ అని అంటారు. మీరు మీ దశపై హర్షితముగా ఉండండి. భగవంతుడైన తండ్రి మనల్ని చదివిస్తున్నారు. భగవంతుడు ఎవరినైనా చదివిస్తారా? మన ఈ విద్యార్థి జీవితము అత్యుత్తమమైనదని పిల్లలైన మీకు తెలుసు. మనం నరుని నుండి నారాయణునిగా, విశ్వానికి యజమానులుగా అవుతాము. ఇక్కడ మనం రావణ రాజ్యంలోకి వచ్చి చిక్కుకున్నాము. తర్వాత సుఖధామములోకి వెళ్తాము. మీరు సంగమయుగీ బ్రాహ్మణులు. బ్రహ్మ ద్వారా స్థాపన జరుగుతుంది. ఒక్కరే ఏమైనా ఉంటారా. ఎంతోమంది ఉంటారు కదా. మీరు ఈశ్వరీయ సేవాధారులుగా అవుతారు. భగవంతుడు స్వర్గ స్థాపన చేసే సేవనేదైతే చేస్తారో, అందులో మీరు సహాయం చేస్తారు. ఎవరైతే ఎక్కువ సహాయం చేస్తారో వారు ఉన్నత పదవిని పొందుతారు. ఎవ్వరూ ఆకలితో మరణించరు. ఇక్కడ ఫకీరుల వద్ద పరిశీలించి చూస్తే వారి నుండి వేలాది రూపాయలు బయటపడతాయి. ఎవ్వరూ ఆకలితో మరణించలేరు. ఇక్కడ కూడా మీరు తండ్రికి చెందినవారిగా అయ్యారు. తండ్రి పేదవాడైనా కానీ, పిల్లలకు ఎప్పటివరకైతే భోజనం లభించదో అప్పటివరకూ అతను స్వయం తినరు ఎందుకంటే పిల్లలు వారసులు. వారిపై ప్రేమ ఉంటుంది. అక్కడైతే పేదవారు అనే విషయమే ఉండదు. అపారమైన ధాన్యము ఉంటుంది. అనంతమైన సంపద ఉంటుంది. అక్కడి వస్త్రధారణ చూడండి, ఎంత సుందరముగా ఉంది. అందుకే బాబా అంటారు, ఖాళీ దొరికినప్పుడు లక్ష్మీ-నారాయణుల చిత్రము ముందుకు వెళ్ళి కూర్చోండి. రాత్రివేళలో కూడా కూర్చోవచ్చు. ఈ లక్ష్మీ-నారాయణులను చూస్తూ-చూస్తూ పడుకోండి. ఓహో బాబా, మమ్మల్ని ఈ విధంగా తయారుచేస్తున్నారు! మీరు ఇటువంటి అభ్యాసము చేసి చూడండి, ఎంత ఆనందము కలుగుతుందో. మళ్ళీ ఉదయం లేచి అనుభవం వినిపించండి. లక్ష్మీ-నారాయణుల చిత్రము మరియు మెట్ల వరుస చిత్రము అందరి వద్దా ఉండాలి. తమను ఎవరు చదివిస్తున్నారు అనేది విద్యార్థులకు తెలుసు. వారి చిత్రము కూడా ఉంది. మొత్తం ఆధారమంతా చదువుపైనే ఉంది. స్వర్గానికి యజమానులుగా అయితే అవుతారు కానీ పదవి అనేది చదువుపై ఆధారపడి ఉంది. బాబా చెప్తున్నారు, ఈ పురుషార్థము చేయండి - నేను ఒక ఆత్మను, శరీరాన్ని కాను, నేను బాబా నుండి వారసత్వాన్ని తీసుకుంటాను. ఇందులో ఏ కష్టమూ లేదు. మాతలకైతే ఇది చాలా సహజము. పురుషులైతే వ్యాపార-వ్యవహారాలలోకి వెళ్ళిపోతారు. ఈ లక్ష్యము-ఉద్దేశ్యము యొక్క చిత్రముపై మీరు ఎంతో సేవ చేయవచ్చు. అనేకుల కళ్యాణమును చేసినట్లయితే మిమ్మల్ని ఎంతగానో ప్రేమిస్తారు. మీరు

మా తల్లి అని అంటారు. జగత్తు కళ్యాణము కొరకు మాతలైన మీరు నిమిత్తులు. స్వయాన్ని చూసుకోవాలి - నేను ఎంతమంది కళ్యాణాన్ని చేసాను, ఎంతమందికి బాబా సందేశాన్ని ఇచ్చాను? తండ్రి కూడా సందేశకుడే, ఇంకెవ్వరినీ సందేశకులు అని అనరు. తండ్రి మీకు సందేశాన్ని ఇస్తారు, అది మీరు అందరికీ వినిపించండి. అనంతమైన తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి, అలాగే 84 జన్మల చక్రాన్ని కూడా స్మృతి చేయండి. సందేశకుడైన తండ్రి యొక్క పిల్లలైన మీరు సందేశాన్ని ఇచ్చేవారు. అందరికీ చెప్పండి - ఇద్దరు తండ్రులు ఉన్నారు, అనంతమైన తండ్రి సుఖము మరియు శాంతుల వారసత్వాన్ని ఇచ్చారు. మనము సుఖధామములో ఉన్నప్పుడు మిగిలినవారంతా శాంతిధామములో ఉండేవారు. తర్వాత జీవన్ముక్తిలోకి వస్తారు. ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి, మళ్ళీ అక్కడ మనమే విశ్వానికి యజమానులుగా ఉంటాము. ఒక పాట కూడా ఉంది - బాబా, మీ నుండి మాకు మొత్తం విశ్వము యొక్క రాజ్యాధికారము లభిస్తుంది. మొత్తం భూమి, సముద్రము, ఆకాశము మా చేతుల్లో ఉంటాయి. ఈ సమయంలో మనం తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటున్నాము. మీరు గుప్త యోధులు, శివ శక్తి సైన్యము. ఇది జ్ఞాన ఖడ్గము, ఇవి జ్ఞాన బాణాలు. వారేమో దేవీలకు స్థూలమైన ఆయుధాలను చూపించారు. భక్తి మార్గంలో ఎన్ని మందిరాలను తయారుచేసారు, ఎన్ని చిత్రాలు మొదలైనవి ఉన్నాయి, అందుకే తండ్రి అంటున్నారు - భక్తి మార్గంలో మీరు ధనం మొదలైనవాటన్నింటినీ సమాప్తం చేసేసారు. ఇప్పుడు ఇవన్నీ అంతమవ్వనున్నాయి, మునిగిపోతాయి. అక్కడ ఏ విధముగా వెళ్ళి గనుల నుండి వజ్ర-వైఢూర్యాలను తీసుకువస్తారు అనేది మీకు సాక్షాత్కారం కూడా చేయించడం జరిగింది ఎందుకంటే ఇవన్నీ భూమిలో కూరుకుపోతాయి. గొప్ప-గొప్ప రాజుల వద్ద భూగర్భ గృహాలు ఉంటాయి, అవన్నీ భూమిలో కూరుకుపోతాయి, తర్వాత మీ కార్మికులు వెళ్ళి తీసుకువస్తారు. లేకపోతే ఇంత బంగారము మొదలైనవి ఎక్కడి నుండి వస్తాయి. స్వర్గపు దృశ్యాన్ని అజ్మీర్ లో చూస్తారు కదా. మ్యూజియంను కూడా అదే విధముగా తయారుచేయండి అని బాబా అన్నారు. స్వర్గము యొక్క ఫస్ట్ క్లాస్ మోడల్ ను తయారుచేయాలి. ఇప్పుడు మనం మన రాజధానిని స్థాపన చేస్తున్నాము అని పిల్లలైన మీకు తెలుసు. ఇంతకుముందు మనకు ఏమీ తెలిసేది కాదు, ఇప్పుడు తెలుసుకుంటూ ఉన్నాము. మనం అందరి లోపల ఏముందో తెలుసుకుంటామని కాదు. కొంతమంది వికారులు కూడా వచ్చేవారు. ఎందుకు వస్తున్నారు? అని వారిని అడిగితే, వస్తేనే కదా వికారాల నుండి విముక్తులమవుతాము, నేను చాలా పాపాత్ముడిని అని అనేవారు. తండ్రి అంటారు - అచ్ఛా, కళ్యాణము జరుగుగాక. మాయ చాలా శక్తివంతమైనది. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు ఈ వికారాలపై విజయాన్ని పొందాలి, అప్పుడే జగత్ జీతులుగా అవుతారు. మాయ కూడా తక్కువేమీ కాదు. ఇప్పుడు మీరు పురుషార్థము చేసి ఈ లక్ష్మీ-నారాయణుల వలె అవుతారు. వీరి వంటి సౌందర్యము ఇంకెవ్వరికీ ఉండదు. ఇది ప్రకృతి సిద్ధమైన సౌందర్యము. ప్రతి 5,000 సంవత్సరాల తర్వాత స్వర్గ స్థాపన జరుగుతుంది, మళ్ళీ 84 జన్మల చక్రములోకి వస్తారు. ఇది యూనివర్శిటీ మరియు హాస్పిటల్ అని మీరు వ్రాయవచ్చు. అదేమో ఆరోగ్యము కొరకు మరియు ఇదేమో ఐశ్వర్యము కొరకు. మీరు వచ్చి ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, సంతోషాన్ని 21 జన్మల కొరకు ప్రాప్తి చేసుకోండి. వ్యాపారస్థులు కూడా తమ బోర్డును పెట్టుకుంటారు. ఇళ్ళల్లో కూడా బోర్డులను పెట్టుకుంటారు. ఎవరైతే నషాలో ఉంటూ ఉంటారో, వారే ఈ విధముగా వ్రాస్తారు. ఎవరు వచ్చినా వారికి అర్థం చేయించండి - మీరు అనంతమైన తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకున్నారు, మళ్ళీ 84 జన్మలను తీసుకొని మీరు పతితులుగా అయ్యారు, ఇప్పుడు పావనులుగా అవ్వండి. స్వయాన్ని ఆత్మగా భావించండి, తండ్రిని స్మృతి చేయండి. బాబా కూడా ఇలాగే చేస్తారు. వీరు నెంబర్ వన్ పురుషార్థీ. కొంతమంది పిల్లలు - బాబా, తుఫానులు వస్తున్నాయి, ఇది జరుగుతుంది అని వ్రాస్తారు. నేను వ్రాస్తాను - నా వద్దకైతే అన్ని తుఫానులూ ముందు వస్తాయి, నేను మొదట అనుభవీగా అయితేనే కదా అర్థం చేయించగలను. ఇది మాయ వ్యాపారము.

ఇప్పుడు తండ్రి అంటారు - మధురమైన ప్రియమైన పిల్లలూ, ఇప్పుడు మీపై బృహస్పతి దశ ఉంది. మీరు ఎవ్వరికీ మీ జన్మపత్రి మొదలైనవాటిని చూపించవలసిన అవసరం లేదు. బాబా మొత్తమంతా చెప్పేస్తారు. అక్కడ ఆయుష్షు కూడా పెద్దగా ఉంటుంది. శ్రీకృష్ణుడిని కూడా యోగేశ్వరుడు అని అంటారు. వారికి యోగేశ్వరుడు యోగాన్ని నేర్పించారు కావుననే ఆ విధముగా తయారయ్యారు. మనుష్యమాత్రులు, సన్యాసులు మొదలైనవారిని యోగేశ్వర్ అని అనడానికి వీల్లేదు. మీకు ఈశ్వరుడు యోగము నేర్పిస్తారు కావున యోగేశ్వర్ మరియు యోగేశ్వరి అన్న పేర్లను పెట్టారు. జ్ఞానేశ్వర్ మరియు జ్ఞానేశ్వరి కూడా ఈ సమయంలో మీరే. మళ్ళీ వెళ్ళి రాజ-రాజేశ్వరిగా కూడా మీరే అవుతారు. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లక్ష్యము-ఉద్దేశ్యమును ఎదురుగా పెట్టుకుని పురుషార్థం చేయండి. లక్ష్మీ-నారాయణుల చిత్రాన్ని ఎదురుగా చూస్తూ మీతో మీరు మాట్లాడుకోండి - ఓహో బాబా, మీరు మమ్మల్ని ఈ విధంగా తయారుచేస్తున్నారు! మాపై ఇప్పుడు బృహస్పతి దశ కూర్చుంది.

2. తమ సమానంగా తయారుచేయడానికి భ్రమరము వలె జ్ఞానాన్ని భూ-భూ చేయండి. ఈశ్వరీయ సేవాధారులుగా అయి స్వర్గ స్థాపనలో తండ్రికి సహాయం చేయండి.

వరదానము:- దేహభానము నుండి అతీతంగా అయ్యి పరమాత్మ ప్రేమను అనుభవం చేసే కమల ఆసనధారీ భవ

కమల ఆసనము బ్రాహ్మణ ఆత్మల శ్రేష్ఠ స్థితికి గుర్తు. ఇటువంటి కమల ఆసనధారీ ఆత్మలు ఈ దేహభానము నుండి స్వతహాగానే అతీతంగా ఉంటారు. వారిని శరీర భానము తన వైపుకు ఆకర్షించదు. ఏ విధంగా బ్రహ్మాబాబాకు నడుస్తూ-తిరుగుతూ ఫరిశ్తా రూపము మరియు దేవతా రూపము సదా స్మృతిలో ఉండేదో, అదే విధంగా సహజంగానే దేహీ-అభిమాని స్థితి సదా ఉండాలి, దీనినే దేహభానము నుండి అతీతంగా ఉండటము అని అంటారు. ఈ విధంగా దేహభానము నుండి అతీతంగా ఉండేవారే పరమాత్మునికి ప్రియమైనవారిగా అవుతారు.

స్లోగన్:- మీ విశేషతలు మరియు గుణాలు ప్రభు ప్రసాదము, వాటిని నావి అని అనుకోవటమే దేహాభిమానము.

అవ్యక్తి సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

బ్రహ్మాబాబాపై ప్రేమ ఉన్నట్లయితే ఇప్పుడు బ్రహ్మాబాబా సమానంగా ఫరిశ్తాగా అవ్వండి. అలా అవ్వాలి అని ఎల్లప్పుడూ మీ లైట్ ఫరిశ్తా స్వరూపము ఎదురుగా కనిపించాలి మరియు భవిష్య రూపము కూడా కనిపించాలి, ఇప్పుడు దీనిని వదిలాను మరియు దానిని తీసుకున్నాను అన్నట్లు ఉండాలి. ఇటువంటి అనుభూతి ఉన్నప్పుడు సంపూర్ణతకు సమీపంగా ఉన్నారని భావించండి.